# బైబిలుపట్ల సరియైన వైఖరి

క్రీస్తు సంఘాలకును మత శాఖల సంస్థలకును మధ్య అనేక విభేదాలున్నాయన్నది విదితమే. వాటన్నిటిని చర్చించడం యిక్కడ మన ఉద్దేశంకాదు, కాని తక్కిన వాటన్నిటికి కారణమైన ప్రాథమిక సూత్రాన్ని మనం చదువుదాం: **అది బైబిలుపట్ల మనకున్న వైఖరి.** లేఖనములపట్ల సరియైన వైఖరిని గూర్చి చర్చించడంలో, మనం మూడు సూత్రాలను ఆలోచించాలి. బైబిలు యొక్క పరిపూర్ణత, అధికారము, శక్తి అనేవాటిని మనం గుర్తించి నప్పుడు, రాయబడిన దేవుని బయల్పాటు యొక్క భావాన్ని, ప్రాముఖ్యతను స్పష్టంగా గ్రహించగలుగుతాము.

## దాని పరిపూర్ణత

బైబిలు మానవునికి తెలుపబడిన దేవునియొక్క సంపూర్ణ చిత్తమైయున్నది. దేవుడు మాట్లాడాడు, అధిక బయల్పాటుకు సంబంధించి ఆయన మాట్లాడడం పూర్తి చేసాడు. బైబిలు పరిపూర్ణమయ్యిందనే వాస్తవానికి భావమేమంటే, పత్మాసు ద్వీపంలో పరవాసిగా నున్న యోహాను చివరి "ఆమెన్"ను వ్రాసి, తన కలాన్ని క్రింద పెట్టినప్పుడు, మానవుని కొరకైన దేవుని సందేశం సంపూర్ణమయ్యింది.

ఒకానొక కాలంలో పరిపూర్ణమైన లేఖనం అని మనం ఉపయోగించే పదం స్థిరమై ఉండేది కాదు. పాత నిబంధన కాలంలో, తన చిత్తాన్ని దేవుడు క్రమ క్రమంగా "సూత్రము వెంబడి సూత్రము ... కొంత ఇచ్చట కొంత అచ్చట" బయలుపరచుతూ ఉండేవాడు (యెషయా 28:10బి).

పాత నిబంధన పూర్తి చేయబడినప్పుడు సహితం, దేవుని బయల్పాటు పరిపూర్ణం కాలేదు. ప్రభువైన యేసు వచ్చి తన తండ్రి చిత్తాన్ని బయలుపరచుతూ కొనసాగించాడు. ముందుగా యివ్వబడని అనేక సూత్రాలను ఆయన ప్రవేశపెట్టాడు. "...అని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా, నేను మీతో చెప్పునదేమనగా" అనే ఈ ప్రతిపాదన కొండమీద ప్రసంగంలో పదే పదే వాడబడింది.

ఆయన భూనివాస జీవితం ముగియవస్తూ ఉండగా, "నేను మీతో చెప్పవలసినవి ఇంకను అనేక సంగతులు కలవు గాని యిప్పుడు మీరు వాటిని సహింపలేరు" అని అన్నాడు (యోహాను 16:12). ఇంకా ఎక్కువ రావలసి ఉంది. ఆ కాలంలో దేవుని

బయల్పాటు పరిపూర్ణం కాలేదు. అయినా ప్రభువైన యేసు యొక్క తదుపరి ప్రతిపాదనను గమనించు: "అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వ సత్యములోనికి నడిపించును ..." (13ఎ వ.). అపొస్తలుల కాలంలో బయల్పాటు సంపూర్ణ మౌతుందని యిక్కడ వాగ్దానముంది. పరిశుద్ధాత్మ వచ్చి వారిని "సర్వ" సత్యములోనికి ("కొంతవరకు" కాదు) నడిపిస్తాడు.

వాస్తవంగా, తరువాత పరిశుద్ధాత్మ అపొస్తలులమీదికి వచ్చాడు (అపొ. 2:4). ఆయన వారిని సర్వసత్యములోనికి నడిపించాడా? ప్రభువు తన వాగ్దానం విషయంలో సత్యవంతుడైయుంటే, అప్పుడు **ఆత్మ** ఆ కార్యాన్ని జరిగించాడు. ఆ కారణాన్నిబట్టియే పేతురు తరువాత "ఆయన దైవశక్తి, జీవమునకును భక్తికిని కావలసినవాటినన్నిటిని మనకు దయచేయుచున్నందున ..." అని అన్నాడు (2 పేతురు 1:3). యాకోబు "సంపూర్ణ నియమాన్ని" సూచించాడు (యాకోబు 1:25). వారు ప్రకటించిన సువార్తగాక మరియొకటి ప్రకటించిన వానిపై పౌలు శాపాన్ని ప్రకటించాడు (గలతీ. 1:8, 9).

అవును, అపొస్తలులు సర్వసత్యంలోనికి నడిపింపబడ్డారు. యేసు తన వాగ్దాన విషయమై నమ్మదగినవాడు దేవుని బయల్పాటు సంపూర్ణమయ్యింది. ఈ వాస్తవాన్ని స్థాపించడంవలన ఆ కాలం మొదలుకొని బయల్పాటు యివ్వబడలేదనేదాన్ని సూచిస్తుంది. "ప్రవక్తలని" నేడు చెప్పుకునేవారు తప్పుడువారనే వాస్తవాన్ని రుజువు చేస్తుంది.

## దాని అధికారం

"అధికారం కొరకు మనం ఎవని యొద్దకు వెళ్లాలి?" అనే ప్రశ్న మత ప్రపంచంలో చాలా ప్రధానమైనదిగా ఉంది. అనేక జవాబులు యివ్వబడ్డాయి, అనేక ఆరోపణలు చేయబడ్డాయి. మనం సంఘం దగ్గరకు వెళ్లాలని కొందరంటారు. అయితే బైబిల్లో అలాటిది ఎక్కడా చెప్పబడలేదు. ప్రతి ఒక్కడు తన సొంత మనస్సాక్షిని అనుసరించాలని మరి కొందరన్నారు, దీన్ని చేయమని బైబిలు కూడా బోధించలేదు. దీనికి భిన్నంగా, అలా చేయకూడదని అది బోధిస్తుంది (యిర్మీయా 10:23; సామెతలు 14:12). ఇంకా యితరులు ఆలోచనా సభలయందు, ధర్మ ప్రచారక సంస్థలయందు నమ్మికయుంచుతారు. కొందరు అధికార ప్రమాణంగా పితృపారంపర్యాచారాల మీద ఆధారపడతారు. ఈలాటి ఆచారాలను ప్రభువు కఠినంగా వ్యతిరేకించారు (మార్కు 7:7-9).

మనం ఎవరి వద్దకు వెళ్లాలి? అధికారం ఎవరి వద్ద ఉందో ఆయన వద్దకే వెళ్లాలి, ఆయన ప్రభువైన యేసు (మత్తయి 28:18). ఆయనకు "సర్వాధికారం" ఉంది. మోషేకుగాని, దావీదుకుగాని, బాప్తిస్మమిచ్చు యోహానుకుగాని, సంఘానికి గాని, కౌన్సిల్స్‌కు  లేక మనస్సాక్షికి గాని ఏ అధికారాన్ని అది మిగల్చదు. రాజైన యేసుకే సర్వాధికారముంది.

దేవుడు నేడు తన కుమారుని ద్వారా మనతో మాట్లాడుతున్నాడు (హెబ్రీ. 1:2). మత సంబంధమైన దేనిని నిర్ణయం చేయాలన్నా, మనం యేసు వద్దకే వెళ్లాలి. మరి యింకెవనిమీదను మనం ఆధారపడకూడదు. మనం ఆయన మాట విందాం, మత

సంబంధమైన విషయాలలో అదే కడపటి తీర్మానం.

రాజు తన చిత్తాన్ని ఎలా తెలిపాడు? క్రీస్తు మనతో ఎలా మాట్లాడతాడు? తన రాయబారుల ద్వారా (2 కొరింథీ. 5:20). పౌలును, మిగిలిన దైవ ప్రేరేపితులైన వారును తమ రాజుయొక్క రాయబారులును, ప్రతినిధులునైయున్నారు. ఆయన వారికి అనుగ్రహించిన పరిశుద్ధాత్మ ద్వారా ఆయన సందేశాన్ని అందిస్తారు (మత్తయి 10:20). వారు క్రీస్తుకు ప్రతినిధులై యున్నారు (యోహాను 20:20-23; మత్తయి 19:28). మనం ముందుగా చూచినట్టే, వారు సర్వ సత్యంలోనికి నడిపింపబడ్డారు. గనుక, వారు మనకిచ్చిన లేఖనాలు అధికారాన్ని కోరుతున్నాయంటే, ఆశ్చర్యపడనవసరం లేదు (2 యోహాను 9; గలతీ. 1:6-9; 1 పేతురు 4:11). మనం "దేవోక్తులు" పలికినట్టే పలకాలి.

క్రొత్త నిబంధన ప్రమాణాన్ని ముగించే తన ఉత్తరంలో, ఆ గ్రంథంతో ఏమియు చేర్చకూడదని, అందులోనుండి ఏదియు తీసివేయకూడదని అంటూ (ప్రకటన 22:18, 19) క్రొత్త నిబంధన లేఖకుల యొక్క సాధారణ అభీష్టాన్ని యోహాను వ్యక్తపరచాడు. అతడు కేవలం ప్రకటన గ్రంథాన్ని మాత్రమే సూచించినట్టు కొందరన్నారు. అదే సత్యమైనా కూడా, లేఖనాలన్నిటి యొక్క సెంటిమెంట్ లేక అభిప్రాయము కూడా అదే. ఈలాటి తత్వము - బైబిలు ఎక్కడ మాట్లాడుతుందో అక్కడ మాట్లాడడం, ఎక్కడ మౌనంగా ఉంటుందో అక్కడ మౌనంగా ఉండేలా చేస్తుంది. లేఖనాలపట్ల సరియైన గౌరవం, అవి ఏమి చెప్తున్నాయో వాటిని గౌరవించడానికి మాత్రమే కాక, వాటి మౌనాన్ని కూడా గౌరవించేలా మనలను నడిపిస్తాయి. "లేఖనాలు దాన్ని ఎక్కడ వద్దంటున్నాయి?" అని మనం అడుగక, "లేఖనాలు ఎక్కడ బోధిస్తున్నాయి?" అని మనం అడుగుదాం. లేఖనముల యొక్క అధికారం అనే ఈ వాస్తవాన్ని స్థాపించడంతో మనం మరి యింకే మూలానికి వెళ్లకూడదు అనేదాన్ని తెలుపుతుంది.

## దాని శక్తి

దేవుని వాక్యము యొక్క శక్తిని గుర్తించలేకపోడానికి గల ప్రధాన కారణాలలో ఒక టేమంటే దాని యొక్క పరిపూర్ణతను, అధికారాన్ని ఎరుగక పోవడమేనని చెప్పవచ్చు. దాన్ని కొందరు "మృత లేఖ"లని పిలుస్తారు. దానికి భిన్నంగా, హెబ్రీ లేఖకుడు దానిని "సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగలది" అని వర్ణించాడు (4:12).

దేవుని వాక్యము ఎల్లప్పుడును శక్తిగలదై తాను పంపబడిన కార్యమును అది నెరవేర్చ సామర్థ్యము గలదైయుంది. ఆయన పలుకగా లోకాలు ఉనికిలోనికి వచ్చాయి. మహత్తుగల మాటచేత ఆయన సర్వమును నిర్వహిస్తున్నాడు (హెబ్రీ. 1:3). క్రీస్తు మాట్లాడి మృతులను బ్రతికించాడు; ఆయన మాట్లాడి భీకరమైన తుఫానును నిమ్మళింపజేశాడు.

మనుష్యులు నోటితో పలికిన ప్రతిపాదనలకంటె, వారి డాక్యూమెంట్స్ ఎక్కువ బలమైనవని, బద్ధులనుగా చేస్తాయని మనం ఆలోచిస్తాం కదా; అయితే వ్రాయబడిన

దేవుని మాటలు ఆయన నోటి మాటలకంటే ఏ మాత్రము తక్కువైనవి కావు సుమీ. వ్రాయబడిన ఆయన వాక్యము లోకాలను కలుగచేయదు; చనిపోయిన వారిని బ్రతికించదు; అది ఆ ఉద్దేశాలకొరకు వ్రాయబడలేదు. ఆత్మలను రక్షించడానికి అది యివ్వబడింది (రోమా 1:16; 1 కొరింథీ. 15:1, 2; యాకోబు 1:21). మృతులను లేపుటకు దేవుడు పలికిన వాక్యము మృతులను లేపగలిగినట్లయితే, ఆత్మలను రక్షించడానికి యివ్వబడిన ఆయన వాక్యము ఆత్మలను రక్షించగలుగుతుంది.

దేవుని వాక్యము వెలుగును, గ్రహింపును అనుగ్రహిస్తుంది (కీర్తన. 119:130). అది కంటుంది (యాకోబు 1:18), ఉజ్జీవింపజేస్తుంది (కీర్తన. 119:50), పవిత్ర పరుస్తుంది (యోహాను 15:3; 1 పేతురు 1:22). రక్షణ కలుగజేయు శక్తిగలదైయుంది (రోమా 1:16). అవును, దేవుని వాక్యము మార్చగలదు. క్రైస్తవులనుగా చేసేది దేవుని వాక్ శక్తియే. క్రైస్తవులమైన తరువాత, మనకు ఆహారం అవసరం; దేవుని వాక్యమే ఆ ఆహారం (1 పేతురు 2:1, 2). వాస్తవంగా, దేవుని వాక్యము దేవుని బిడ్డను సమస్త సత్ క్రియలకు పూర్ణంగా సిద్ధపరుస్తోంది (2 తిమోతి 3:16, 17).

## ముగింపు

దేవుని వాక్యంతో జనులు ఎల్లప్పుడు అసంతృప్తులైయున్నారు. ఎల్లప్పుడు వారు మరి మరి ఏదో కావాలని కోరారు. పాతాళంలో ఉన్నవాడు మృతులలోనుండి ఒకడు తన సహోదరుల వద్దకు వెళ్లాలని కోరాడు (లూకా 16). "వారియొద్ద మోషేయు ప్రవక్తలును ఉన్నారు; వారి మాటలు వినవలెనని" అబ్రాహాము బదులిచ్చాడు (లూకా 16:29). నేడు, మోషే ప్రవక్తలతో పాటు, క్రీస్తును, ఆయన అపొస్తలులును మనకున్నారు. బైబిలు పరిపూర్ణమైనదైయున్నందున, ఆధునిక "బయల్పాటును" మనం నిరాకరించాలి. బైబిలే మన అధికారం; గనుక మానవ సిద్ధాంతాలను, ఆజ్ఞలను మనం నిరాకరించాలి. దేవుని వాక్యము శక్తివంతమైనదైనందున, అద్భుతాలకొరకు మనం చూడనక్కరలేదు, "చెప్పబడిన దానికంటే శ్రేష్ఠమైన అనుభూతినిచ్చు" మార్పిడి సిద్ధాంతాలను మనం లక్ష్యపెట్టనక్కరలేదు. దానికి ప్రతిగా క్రొత్త నిబంధన మార్పిడి నమూనాలను మనం చేపట్టాలి.

భూమి ఆకాశములతోపాటు మానవ అభిప్రాయాలు బోధలు గతించిపోతాయి; కాని దేవుని వాక్యం అలా పోదు (2 పేతురు 3:10; మత్తయి 24:35). మారుతున్న ఈ రోజుల్లో, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో కరిగిపోయేటప్పుడు, శాశ్వతంగా నిలిచే దానితో మనం కట్టబడియున్నామని తెలిసికొనడం ఎంత ఆదరణగా ఉంటుందో!